క్లుప్తంగా

ఈటల ఆరోపణలు అవాస్తవం

నవీపేట: మునుగోడు ఉప ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నుంచి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రూ.25 కోట్లు తీసుకున్నారని ఈటల రాజేందర్ చేసిన ఆరోపణలను కాంగ్రెస్ నాయకులు ఖండించారు. జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ రాజేంద్రకుమార్‌గౌడ్, కాంగ్రెస్ నేతలు ఆదివారం మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్‌లలోనే అమ్ముడుపోయే నాయకులు ఉన్నారని కాంగ్రెస్‌లో ఇలాంటి సంస్కృతి లేదని పేర్కొన్నారు.

దిష్టిబొమ్మ దహనం



బోధన్‌టౌన్(బోధన్): బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ రేవంత్ రెడ్డిపై చేసిన ఆరోపణలకు నిరసనగా ఆదివారం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఈటల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మాట్లాడారు. ఈటల చేసిన ఆరోపణలను నిరూపించాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు నిరాధారమైతే వెంటనే రేవంత్ రెడ్డికి క్షమాపణ చెప్పాలన్నారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు ఫరూక్, పట్టణ అధ్యక్షులు తలారి నవీన్, మైనార్టీ జిల్లా కార్యదర్శి సాజిద్‌బుడు, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్ రెడ్డి, తదితరులున్నారు.

నియామకం



నవీపేట: బీజేపీ ఎస్సీ మోర్చా విభాగం జిల్లా కార్యదర్శిగా మండలంలోని నందిగామకు చెందిన గుంజల నాగభూషణం నియమితులయ్యారు. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు శివప్రసపాద్, బోధన్ నియోజకవర్గ నాయకులు వడ్డీ మోహన్‌రెడ్డిలు ఈ మేరకు ఆదివారం నియామకపత్రాన్ని అందజేశారు. పార్టీ పటిష్టతకు కృషి చేసే ప్రతి కార్యకర్తకు బీజేపీలో ప్రాధాన్యత ఉంటుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. మండల నాయకులు బందెల ఆనంద్, రామకృష్ణ, రాజేందర్‌గౌడ్, రాము, భాను గౌడ్, రమణారావ్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



నవీపేట: బోధన్‌లో ఈనెల 30న నిర్వహించే మహనీయుల జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను ఫకీరాబాద్ గ్రామంలో ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ ప్రతినిధులు కోటేశ్వర్‌రావ్, నీరడి ఈశ్వర్, పాండు, సూర్యకాంత్, శంకర్, రవి పాల్గొన్నారు.

రెంజల్‌లో..



రెంజల్(బోధన్): మహనీయుల జయంతి సభ కరపత్రాలను ఆదివారం రెంజల్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. 28న జరిగే హలో మహాజన–ఛలో బోధన్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగ వచ్చే మహనీయుల జయంతి సభను ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోశెట్టి, సాయిలు, లాలు, గంగాధర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని గ్రంథాలయానికి సామాజిక సేవకుడు పట్వారి తులసి కుమార్ ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకొని పోటీ పరీక్షలకు అవసరమయ్యే పాఠ్య పుస్తకాలు అందజేశారు. అలాగే మహనీయుల జీవిత చరిత్ర అంశాల పుస్తకాలు, తెలుగు, ఇంగ్లీష్ డిక్షనరీలు, భగవద్గీత వంటి పుస్తకాలను గ్రంథాలయానికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అజ్ఞానం అనే చీకటిలో నుంచి జ్ఞానమనే దీపంలా వెలుగును నింపేది పుస్తకమని అన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయ ఇంచార్జ్ వరలక్ష్మి, పాఠకులు పాల్గొన్నారు.

చిన్నయానం అంటేనే చిన్నచూపా!

- బీటీ రోడ్డుకు నోచుకోని మారుమూల గ్రామం
- పంచాయతీకి సొంత భవనం కరువు
- తమ ఊరిని అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజల ఆవేదన



అద్దె భవనంలో కొనసాగుతున్న పంచాయతీ కార్యాలయం

డొంకేశ్వర్(ఆర్మూర్): చిన్నయానం.. ఈ ఊరు పేరు ప్రస్తుతం జిల్లాలో ఫేమస్‌గా మారింది. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌కు ఆనుకుని ఉన్న ఈ మారుమూల గ్రామం నూతనంగా ఏర్పడిన డొంకేశ్వర్ మండలం పరిధిలో ఉంది. ఈ ప్రాంతం జింకలకు నెలవుగా మారడంతో టూరిస్ట్ ప్లేస్‌గా మారింది. కానీ, చిన్నయానంలో మాత్రం అభివృద్ధి మచ్చుకైనా కనిపించడం లేదు. కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు గ్రామం మీదుగా వాహనాల్లో వచ్చి వెళ్తున్నారే తప్ప కనీస అభివృద్ధిని పట్టించుకోవడం లేదు. గ్రామం ఏర్పడిన నాటి నుంచి కేవలం ఒక్కసారి మాత్రమే బీటీ రోడ్డు వేశారు. ప్రస్తుతం అది ఆనవాళ్లు లేకుండా పోయింది. కొన్ని చోట్ల కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. పాతికేళ్లుగా రోడ్డు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. మట్టి రోడ్లపై వాహనాలు వెళ్లడంతో ఇళ్లలోకి దుమ్ము వస్తోందని వాపోతున్నారు. అయితే, ఇటీవల బీటీ రోడ్డు మంజూరైందని గ్రామస్తులు పేర్కొంటుండగా, పనులు మాత్రం ప్రారంభం కాలేదు. జీజీ నడ్కుడ వరకే బీటీ రోడ్డు వేశారు. నడ్కుడ నుంచి చిన్నయానం వరకు ఐదు కిలో మీటర్ల వరకు మట్టి రోడ్డే ఉంది. బస్సు కూడా లోపలికి రావడం ఇబ్బందిగా మారింది. అదే విధంగా ఊరి మధ్యలో నుంచి వెళ్తున్న ఇరిగేషన్ కాలువలో పిచ్చి మొక్కలు, తుంగ పెరగడంతో పూర్తిగా మురికి కాలువగా మారింది. దీంతో గ్రామంలో దోమల బెడద ఎక్కువగా ఉందని వాపోతున్నారు.

గ్రామ లెక్కలు ఇలా..		పురుషులు	219
నివాసాలు	130	మహిళలు	289
జనాభా	508	ఓటర్లు	287

కమ్యూనిటీ భవనంలో అద్దెకు..

చిన్నయానం గ్రామ పంచాయతీగా ఏర్పడి ఐదేళ్లు అవుతోంది. కానీ, ఇప్పటి వరకు సొంత భవనం లేదు. ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న ఒక కమ్యునిటీ భవనంలో అద్దెకు కొనసాగుతోంది. భవనం కూడా చిన్నదిగా ఉండడంతో పాలకవర్గ సమావేశాలు నిర్వహించుకోవడానికి, గ్రామ సభలు పెట్టడానికి ఇబ్బందులు పడుతున్నారు. జీపీ భవనానికి నిధులు మంజూరైనా నిర్మించడానికి కాంట్రాక్టర్ ఎవరూ ముందుకు రావడం లేదు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



గ్రామానికి బీటీ రోడ్డుతో పాటు జీపీకి సొంత భవనం నిర్మించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రోడ్డు, జీపీ భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభం కావాల్సి ఉంది. అయితే, కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలిసింది. గ్రామంలో అభివృద్ధి పనులకు అదనపు నిధులివ్వాలని అధికారులను కోరుతాం.

– ఎర్ర సుస్మిత, గ్రామ సర్పంచ్



బస్టాండ్ పరిస్థితి



గ్రామంలో ఇరిగేషన్ కాలువ దుస్థితి



కంకర తేలిన బీటీ రోడ్డు

ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక



నివేదికలను చదివి వినిపిస్తున్న సీఆర్‌పీలు

కమ్మర్‌పల్లి: మండలంలోజనవరి 1, 2020 నుంచి మార్చి 31, 2023 వరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై ఆదివారం సామాజిక తనిఖీ బృందం నివేదికను సమర్పించింది. మండలంలోని 14 గ్రామాల్లో గడిచిన మూడు సంవత్సరాలకు గాను రూ.14.45 కోట్ల వ్యయంతో 1,261 పనులను ఉపాధి హామీ పథకం కింద చేపట్టారు. 15 రోజులుగా తనిఖీ బృందం గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ప్రజావేదికలో డీఆర్‌డీవో చందర్ నాయక్, అంబుడ్స్‌మెన్ శ్రీనివాసరావు, డీపీవో నారాయణ సమక్షంలో ఎస్ఆర్‌పీ మహేష్ ఆధ్వర్యంలో సీఆర్‌పీలు మస్టర్‌లో కొట్టివేతలు, కొలతల్లో తేడాలు, జాబ్ కార్డ్స్, హరితహారం పథకం కింద మొక్కలు నాటడం, గుంతలు తవ్వకం, కొలతల్లో తేడాలు, బిల్లుల చెల్లింపులు, కూలీ చెల్లింపులు, కూలీల హాజరు తదితర పనుల్లో జరిగిన తప్పులు, అవకతవకలను చదివి వినిపించారు. తప్పులు, అవకతవకలకు సంబంధించి విజిలెన్స్ అధికారి జరిమానా విధించగా, కొన్ని తప్పులకు రికవరీతో పాటు సంజాయిషీకి నోటీసులు జారీ చేశారు. ఎంపీడీవో సంతోష్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, ఏపీవో విద్యానంద్ పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను ఆచరించండి

- శివాచార్య మహరాజ్
- బోధన్‌లో వైభవంగా కొనసాగిన అఖండ శివనామ సప్తాహం

బోధన్: వీరశైవ ధర్మ సంస్కృతి, సంప్రదాయాలను నిజ జీవితంలో ఆచరించాలని మహారాష్ట్ర ప్రాంత బేట్‌ముంగ్రా వీరశైవ మఠాధిపతి సిద్ధదయాళ్ శివాచార్య మహరాజ్ ప్రబోధించారు. ప్రతి ఒక్కరూ దైవ భక్తి కలిగి ఉండాలని, ఆధ్యాత్మిక చింతనతోనే నిజ జీవితంలో ప్రశాంతత ప్రాప్తిస్తోందని వివరించారు. అన్ని జీవరాసుల కన్నా మానవ జన్మ ఎంతో ఉన్నతమైందన్నారు. సమాజ హితం కోసం మంచి పనులు చేసి మానవ జన్మను సార్థకం చేసుకోవాలని పేర్కొన్నారు. వీరశైవ ధర్మ జాగృతి కోసమే అఖండ శివనామ సప్తాహ సంప్రదాయం కొనసాగిస్తున్నామన్నారు. వీరశైవ సమాజ్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 18వ అఖండ శివనామ సప్తాహం నాల్గో రోజు వైభవంగా కొనసాగింది. సప్తాహం శిబిరానికి విచ్చేసిన మఠాధిపతి భక్తులను ద్దేశించి ప్రవచనాలు చేశారు.



ప్రవచనాలు చేస్తున్న శివాచార్య మహరాజ్

కోర్టుకు వెళ్లామని పంచాయతీ పెడుతున్నారు

బాల్కొండ: భూమి కబ్జాకు గురి చేస్తున్నారని కోర్టుకు వెళితే గ్రామంలో వీడీసీ ప్రతినిధులు తమపై పంచాయతీ పెడుతున్నారని బాల్కొండ మండల కేంద్రంలో పెద్దమ్మ కాలనీ ప్రజలు ఆదివారం బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు.. పెద్దమ గల్లీలో ప్లాట్లు ఏర్పాటు చేసినప్పుడు లే అవుట్ ప్రకారం ఈపీకి 10 శాతం భూమిని కేటాయించారు. కానీ కొందరు వ్యక్తులు వీడీసీ సహకారంతో ఆ భూమికి కబ్జా చేయటానికి కుట్రలు పన్నారు. దీంతో కాలనీవాసులు ఆర్మూర్ కోర్టును ఆశ్రయించారు. భూమిని కబ్జా చేశామని కోర్టును ఎలా ఆశ్రయిస్తారంటూ వీడీసీ ప్రతినిధులు సోమవారం గ్రామంలో పంచాయతీ పెట్టి జరిమానా వేయడానికి కుట్రలు చేస్తున్నారని కాలనీ వాసులు ఆరోపించారు.



బాల్కొండ పోలీస్ స్టేషన్ వద్ద బాధితులు

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు



బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 126వ రోజుకు చేరాయి. దీక్షలో న్యాయవాదులు అడ్లూరి శ్రీనివాస్, అనిల్‌లు కూర్చున్నారు. సీనియర్ న్యాయవాది అర్జున్ రాందర్ దీక్షలను ప్రారంభించారు. ప్రత్యేక జిల్లా సాధించే వరకు దీక్షలు కొనసాగిస్తామని, సబ్బండ వర్గాల ప్రజలను ఏకతాటికి పైకి తెచ్చి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని న్యాయవాదులు తెలిపారు.

రెండో రోజు కొనసాగిన శివనామ సప్తాహం

రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలోని లింగమయ్య గుట్టపైన అమృతేశ్వర ఆలయం వద్ద రెండో రోజు ఆదివారం అఖండ శివనామ సప్తాహం కార్యక్రమం కొనసాగింది. కామప్ప మహరాజ్ కీర్తనకార్‌గా వ్యవహరించగా, జగద్గురు ఆచార్య మదన్‌జీ మహరాజ్ భక్తులకు ప్రవచనం చేశారు.

జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి

బోధన్/రుద్రూర్ : ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 30న బోధన్ పట్టణ కేంద్రంలో మహనీయుల జయంతోత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు ఆ కమిటీ డివిజన్ గౌరవ అధ్యక్షుడు పరిమి కోటేశ్వర్ రావు, ప్రతినిధులు న్యాయవాది నీరడి ఈశ్వర్, కొంద్ర వెంకటి తెలిపారు. ఆదివారం రుద్రూర్‌తో పాటు బోధన్ పట్టణ కేంద్రంలో వారు మాట్లాడారు. బహుజన బాంధవులు మహాత్మా జ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రాంల జయంతిని పురస్కరించుకుని మహనీయుల జయంతోత్సవాలు ప్రతి ఏడాదిలాగాగే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. పట్టణ కేంద్రంలో అంబేడ్కర్ చౌరస్తాలో సాయంత్రం 3.45 గంటలకు సభ ఉంటుందని, ముందుగా ఆచన్‌పల్లి కమాన్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు మహా ర్యాలీ నిర్వహిస్తామన్నారు. సభకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, తదితరులను ఆహ్వానించామని వెల్లడించారు. అందరూ వచ్చి విజయవంతం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న కమిటీ డివిజన్ ప్రతినిధులు

ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో యజ్ఞం

నవీపేట: మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం వైదిక యజ్ఞం నిర్వహించారు. మహా క్రతువు యజ్ఞాలతో వాతావరణంలో కాలుష్యం నిర్వీర్యం అవుతుందని, సకాలంలో వర్షాలు కురిసేందుకు దోహదం చేస్తాయని ఆర్య సమాజ్ ప్రతినిధులు గంజి సాయన్న, నరేంద్ర శేఖర్, మ్యాక లక్ష్మన్, తమ్మల గంగాధర్‌లు పేర్కొన్నారు. ప్రతి ఆదివారం ఈ యజ్ఞ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

మాక్లూర్: జెడ్పీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఆదివారం మెట్టు, లక్మాపూర్ సింగంపల్లితండా, కింది తండాలలో జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్‌లు అనుగు గంగాధర్, పద్మ, ఎంపీటీసీలు పురుషోత్తంరావు, యాకుబ్, రాము, జోర్‌సింగ్, అశోక్, కిషన్, హన్మంత్‌రావు, వరప్రసాద్‌లు పాల్గొన్నారు.

సామాజిక చైతన్య క్రాంతికారుడు బసవేశ్వరుడు



బోధన్ ఆర్డీవో ఆఫీసులో బసవేశ్వరుడి జయంతిలో పాల్గొన్న ఆర్డీవో రాజేశ్వర్, వీఆర్ దేశాయ్



ఏకచక్రేశ్వరాలయంలో పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మాశరత్ రెడ్డి దంపతులు

బోధన్: శతాబ్దాల క్రితమే సమాజంలో నెలకొన్న మూఢ నమ్మకాలు, కుల వ్యవస్థను వ్యతిరేకించి సమానత్వం కోసం ప్రజలను జాగృత పర్చిన వీరశైవ ధర్మ వ్యవస్థాపకుడు మహాత్మా బసవేశ్వరుడు సామాజిక చైతన్య క్రాంతికారుడని బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ కొనియాడారు. బసవేశ్వరుడి ఆశయాలు, ఆలోచన, ఆచరణ భావితరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆదివారం బోధన్ ఆర్డీవో ఆఫీసులో అధికారికంగా బసవేశ్వరుడి జయంతి వేడుకలను నిర్వహించారు. బసవేశ్వరుడి చిత్ర పటానికి పూజలు చేశారు. వీరశైవ లింగాయత్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు దేశాయ్ పాల్గొన్నారు.

వీరశైవ సమాజ్ ఆధ్వర్యంలో..

పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో వీరశైవ సమాజ్ ఆధ్వర్యంలో బసవేశ్వరుడి జయంతి వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్‌రెడ్డిలు విచ్చేసి బసవేశ్వరుడి చిత్రపటానికి పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ బీర్కూర్ బుజ్జి, డైరెక్టర్లు, కౌన్సిలర్ శ్రీకాంత్‌గౌడ్, వీరశైవ సమాజ్ పట్టణ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే అనిల్ టాకీస్ చౌరస్తాలో జయంతి నిర్వహించారు.



పాత వర్నిలో..

వర్నిలో..

వర్ని: మండలంలోని పాత వర్నిలో బసవేశ్వరుడి జయంతిని ఘనంగా నిర్వహించారు. వీరభద్ర ఆలయంలో ఆదివారం బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతిని నిర్వహించారు .అనంతరం అల్పాహారాన్ని పంపిణీ చేశారు.

దొన్కల్‌వాసికి అంబేడ్కర్ సేవా పురస్కారం

మోర్తాడ్: దొన్కల్‌కు చెందిన శివకుమార్ జిన్నను హైదరాబాద్‌లోని జైభీమ్ విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సేవా పురస్కారంతో సత్కరించారు. ఆదివారం రవీంద్ర భారతిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సాహితీ సేవలో తరిస్తున్న శివకుమార్ జిన్నను తెలంగాణ ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ వేణుగోపాల చారి, వికలాంగు కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి, సంస్థ ప్రతినిధులు డాక్టర్ కోతి శ్రీనివాస్, క్రిష్ణవేణి తదితరులు సత్కరించారు.



సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడికి సన్మానం

రెంజల్(బోధన్): మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా ఎన్నికైన రెంజల్ సర్పంచ్ మర్ల రమేశ్‌కుమార్‌ను గ్రామ బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆదివారం రెంజల్ రైతు వేదికలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రమేశ్‌కు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ విండో చైర్మన్ ప్రశాంత్, నాయకులు రఫీక్, షబ్బీర్, వీరప్రతాప్, సాయాగౌడ్, వేణు, నారాయణ, అంజయ్య, ఆనంద్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఆర్ ఫౌండేషన్ ఆర్థిక సాయం

మాక్లూర్: కుటుంబ పెద్ద మృతి చెందటంతో రోడ్డున పడ్డ లక్మాపూర్‌కు చెందిన ఓ నిరుపేద కుటుంబానికి ఆదివారం ఆర్ఆర్ ఫౌండేషన్ ముందుకొచ్చి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసింది. లక్మాపూర్‌కు చెందిన లక్ష్మిది అతి నిరుపేద కుటుంబం. ఇటీవల ఆమె భర్త సంపత్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉన్న డబ్బులు ఆస్పత్రులకే ఖర్చుకావటంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఈ విషయం తెలుసుకున్న ఆర్ఆర్ ఫౌండేషన్ సాయం అందించింది. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రాజారెడ్డి, మహేష్, సంతోష్‌రెడ్డి ఉన్నారు.

డబ్బుల కోసమే సీసీ రోడ్లు..!

బాల్కొండ: మండల కేంద్రంలోని ఏబీనగర్ కాలనీలో సీసీ రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్తు స్తంభాన్ని పరిశీలిస్తే కేవలం డబ్బుల కోసమే సీసీ రోడ్లు వేస్తున్నట్లు కనిపిస్తుంది. నూతనంగా ఈ మధ్యనే కాలనీలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు వేశారు. సీసీ రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం ఉంది. కానీ ఆ స్తంభాన్ని తీయకుండానే అలానే సిమెంట్ రోడ్డు వేసి కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నాడు. సీసీ రోడ్లు ప్రజల రవాణా కోసం కాకుండా కేవలం కాంట్రాక్టర్ల కడుపులు నింపుకోవటానికే చేసినట్లు ఉందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారులు కూడా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.



ఏబీనగర్‌లో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం



కొమ్మలను తొలగించండి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హుస్నాబాద్‌కాలనీ సమీపంలో రోడ్డు పక్కన కొమ్మలు విరిగిపడ్డాయి. రెండు రోజుల క్రితం ఈదురు గాలులకు విరిగిన కొమ్మలను మున్సిపల్ సిబ్బంది ఇప్పటి వరకు తొలగించలేదు. వాహనదారులు కొమ్మలకు తగిలి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా స్పందించి ఆ కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

అర్హులైన పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

రుద్రూర్: అర్హులైన నిరుపేదలందరికి డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ఖాళీ స్థలం ఉన్న పేదలు ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.10 లక్షలు మంజూరు చేయాలని ప్రగతి శీల మహిళా సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. మోస్రా మండలం తిమ్మాపూర్‌లో ఆదివారం బోధన్ డివిజన్ కమిటీ ప్రగతి శీల మహిళా సంఘం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే చేసి, సంతకాల సేకరణ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. కంట్రోల్ షాపుల ద్వారా రేషన్ బియ్యం ఒక్కొక్కరికి కేంద్ర ప్రభుత్వం ఐదు కిలోలు, రాష్ట్ర ప్రభుత్వం ఐదు కిలోలు మొత్తం 10 కిలోల సన్న బియ్యం ఇవ్వాలని, అలాగే 12 రకాల సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళ సంఘం బోధన్ డివిజన్ నాయకురాలు బి. నాగమణి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహిళా సంఘం సభ్యులు